

డీసీసీబీని లాభాల బాటలోకి తీసుకెళ్తా : చైర్మన్

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్ర సహకార బ్యాంకును లాభాల బాటలోకి తీసుకెళ్తానని డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య అన్నారు. జిల్లా కార్యాలయంలో గురువారం బ్యాంకింగ్ లావాదేవీలు, రుణాలు, బకాయిలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు కార్యకలాపాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. కార్యక్రమంలో నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, ప్రొఫెషనల్ డైరెక్టర్ మోహన్ ఐయ్యర్, డీసీసీబీ సీజీఎం జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

కోనాపూర్ రోడ్డుకు మహర్దశ

- డబుల్ రహదారి నిర్మాణానికి రూ.45కోట్లు మంజూరు
- తీరనున్న వాహనదారుల ఇక్కట్లు
- ఆమనగల్లు, మాడ్గుల మండల ప్రజల హర్షం



8

ఎయిర్‌పోర్ట్‌లో 'అతిథి దేవోభవ'

- రాష్ట్ర పర్యాటక శాఖ, జీహెచ్ఎంసీతో కలిసి ప్రారంభించిన జీఐఏ
- రెండో ఎడిషన్ షురూ..
- 1000 మంది డ్రైవర్లకు మూడు రోజుల ఇంటెన్సివ్ శిక్షణ



7

బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 204కోట్లు

- రహదారుల అభివృద్ధి, ఆధునీకరణకు నిధులు
- సీఎం రేవంత్ సహకారంతో కల్వకుర్తికి మహర్దశ
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



7



ధాన్యం కొనుగోళ్లకు
సన్నద్ధం


- సన్నవరి సాగు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మరికొన్ని సెంటర్లు
- అందుబాటులో గన్నీబ్యాగులు, టార్పాలిన్లు
- ఈసారి పెరిగిన వరి సాగు విస్తీర్ణం
- మద్దతు ధరపై క్వింటాల్‌కు రూ.117 పెంపు
- సన్నాలకు రూ.500 బోనస్

జిల్లావ్యాప్తంగా 45 కేంద్రాల ఏర్పాటు

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది (2023) వానాకాలం సీజన్‌లో 1,32,559 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయగా, ఈసారి (2024 వానాకాలం) 1,38,187 ఎకరాల్లో పంటను వేశారు. గతేడాది కంటే ఈ సారి సాగు విస్తీర్ణం 5,628 ఎకరాలు పెరిగింది. సాగుకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మొత్తం 45 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

గత సంవత్సరం 33 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈసారి 45 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పోయిన ఏడాది కొనుగోలు కేంద్రాలు మూసే సమయానికి రూ.22కోట్ల విలువ గల 10,016 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ప్రభుత్వం గత ఏడాది కంటే ఈ సారి వరి ధాన్యం క్వింటాల్‌కు మద్దతు ధరపై రూ.117 ఎక్కువగా ప్రకటించింది. అలాగే సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వనుంది. అలాగే కేంద్రాల్లో 80వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ధాన్యం

మిగతా 8వ పేజీలో...



గతేడాది కొనుగోళ్ల వివరాలు

సాగు విస్తీర్ణం (ఎకరాలు)
1,32,559

ధాన్యం సేకరణ లక్ష్యం
40,000 మెట్రిక్ టన్నులు

కొనుగోలు కేంద్రాలు
33

సేకరించిన ధాన్యం
10,016 మెట్రిక్ టన్నులు (విలువ రూ.22 కోట్లు)

ఈ ఏడాది సేకరణ లక్ష్యం

సాగు విస్తీర్ణం (ఎకరాలు)
1,38,187

ధాన్యం సేకరణ లక్ష్యం
80,000 మెట్రిక్ టన్నులు

కొనుగోలు కేంద్రాలు
45

కావాల్సిన గన్నీ బ్యాగులు
15,61,639

అందుబాటులో ఉన్నవి
4,38,361

మద్దతు ధర (క్వింటాలుకు రూ.లలో..)

	2023-24	2024-25	పెరిగిన ధర
సాధారణ రకం	2,183	2,300	117
గ్రేడ్ ఏ-రకం	2,203	2,320	117

సెలవులకు ఇంటికొస్తే
సర్పంచ్‌ను చేశారు

అప్పట్లో గ్రామంలో ఒకే ఒక డిగ్రీ హోల్డర్‌ను

- అన్ని తరగతుల్లోనూ నాదే ఫస్ట్ ర్యాంక్
- ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా ఉండేది
- రాగి సంకటి, అంబలి టీ, టిఫిన్లు
- ఆధ్యాత్మిక చింతన, క్రమశిక్షణే విజయ రహస్యం
- ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అన్ని తరగతుల్లోనూ ఆయనే ఫస్ట్. క్లాస్ లీడర్‌గానూ గుర్తింపు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం. కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి మరీ విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ అంటే మహా ఇష్టం. ఆటల్లోనూ అగ్రస్థానమే.. డిగ్రీ అనంతరం వచ్చిన వేసవి సెలవులు ఆయన జీవితాన్ని మార్చాయి. సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి శాసనసభలో అడుగుపెట్టిన ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇన్నర్ వ్యూ ఆయన మాటల్లోనే..

మా సొంతూరు షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని వీర్లపల్లి. తల్లిదండ్రులు కాసులబాద్ రాజయ్య, అంజమ్మ. మా ఇంట్లో నేనే పెద్ద. నాతో పాటు ముగ్గురు సోదరీమణులు. మాది వ్యవసాయ కుటుంబం. చిన్నతనం నుంచే నాకు చదువులపై ఆసక్తి ఎక్కువ. నిరుపేద కుటుంబం కావడంతో చదువుకోవడానికి పుస్తకాలు కొనలేని దుస్థితి. అయినా అమ్మానాన్నలు చదువులో నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. వాళ్ల ఆశయాలను గౌరవిస్తూ అన్ని తరగతుల్లోనూ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను. డిగ్రీ పూర్తి చేయడంతో పాటు, ఎంఏ, బీఈడీలో కూడా మంచి ర్యాంకుతో సీటు సంపాదించాను. కాగా, అనుకోని పరిస్థితుల్లో రాజకీయాల్లోకి అరంగేట్రం చేయాల్సి వచ్చింది. లేకుంటే నేను కూడా ఏ ప్రభుత్వ ఉద్యోగిగానో స్థిరపడే వాడిని.

క్లాస్ లీడర్‌గా అవకాశం

విద్య పట్ల నాకున్న ఆసక్తిని గుర్తించిన మా టీచర్లు నాకు క్లాస్ లీడర్‌గా అవకాశం ఇచ్చారు. 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు మా తరగతిలో నేనే క్లాస్ లీడర్‌ను. ఆ రోజుల్లో అది నాకు చాలా

మిగతా 7వ పేజీలో..



ఇన్నర్ వ్యూ

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు తనిష్క్

అండర్-19 (70 కేజీల విభాగంలో) ఎంపిక
అభినందించిన కళాశాల యాజమాన్యం

7

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

బ్లాక్ స్పాట్‌లను గుర్తించి నివేదిక ఇవ్వాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ మండలంలో రహదారి భద్రత కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్డుకు సంబంధించిన ప్రతీ జోన్‌కు ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి తగిన నివేదిక అందించాలన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్, రాచకొండ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, డీఆర్వో సంగీత, ఎన్‌హెచ్ డీఈ సబిత, ఆర్టీసీ జోనల్ అధికారి సుచరిత పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు ఏర్పాట్లు

గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ శశాంక తెలిపారు. పరీక్ష నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి డీజీపీ, సీపీలు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు జరిగే పరీక్షల కోసం జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. 8 వేల మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మొదటి పరీక్షకు ఉపయోగించిన అదేహాల్ టికెట్‌ను మిగిలిన ఆరు పరీక్షలకు ఉపయోగించాలని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని హాల్ టికెట్లు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేయడతాయని చెప్పారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత అభ్యర్థులను ఎవరిని కూడా పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదన్నారు. అభ్యర్థి తమ గ్రూప్-1 సర్వీసెస్ ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఎంచుకున్న భాషలో అన్ని మెయిన్స్ పరీక్షలను (జనరల్ ఇంగ్లిష్ మినహా) రాయాలని చెప్పారు. పరీక్ష ఎంచుకున్న భాషలో కాకుండా ఇతర భాషలో పరీక్ష రాసినట్లయితే అలాంటి సమాధానాలు బుక్‌లెట్‌లు మూల్యాంకణం చేయబడవన్నారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీ ఈసీవో కృష్ణారెడ్డి, మైనారిటీ వెల్ఫేర్ అధికారి నవీన్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పోలీసులకు సవాలుగా వరుస హత్యలు

- ఏడాది క్రితం కందుకూరు మండలం దాసర్లపల్లిలో మహిళ హత్య
- ఇటీవల కొత్తగూడలో జంట హత్యలు

కందుకూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వ్యవసాయ క్షేత్రాల్లో జరుగుతున్న వరుస హత్యకేసులు పోలీసులకు సవాలుగా మారాయి. దాసర్లపల్లిలోని ఓ ఫాంహౌజ్‌లో పనిచేస్తున్న శైలజను 2023 మార్చిలో దారుణంగా హత్యచేసిన సంఘటనలో పోలీసులు క్రైం నెంబర్ 79/2023 కింద కేసు నమోదు చేశారు. ఇప్పటికీ ఆ కేసును ఛేదించలేకపోయారు. బుధవారం కొత్తగూడలో మనోహర్‌రావు అనే వ్యక్తికి చెందిన మామిడితోటలో పని చేస్తున్న వృద్ధ దంపతులు ఉషయ్య(75), భార్య శాంతమ్మ(65) హత్య గురయ్యారు. పోలీసులు క్రైం నెంబర్ 237/2024 కింద కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కాగా, దాసర్లపల్లిలో ఏడాది క్రితం జరిగిన మహిళ హత్య, కొత్తగూడలో జరిగిన జంట హత్యలు ఒకేలా ఉండడంతో పోలీసులు ఆ కోణంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు. మొదటగా హత్యకు గురైన వారి కుటుంబ సభ్యులు, లేదా ఫాంహౌజ్ యజమానులపై అనుమానంతో పలువురిని విచారించినా దర్యాప్తు ముందుకు సాగలేదు. ముగ్గురి హత్యలు సైకోలు చేసి ఉండవచ్చని అనుమానంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. అయితే, గతంలో ఇలాంటి హత్యలు ఈ ప్రాంతంలో జరగలేదని, హత్యచేసిన దుండగులు ఇతర ప్రాంతాలకు చెందినవారై ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మహేశ్వరం అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఎస్వోటీ డీసీపీ మురళీధర్‌రావు నేతృత్వంలో మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి ఈ రెండు కేసులను ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.



మిద్దే.. వ్యవసాయ క్షేత్రం

- రసాయనాలు లేకుండా కాయగూరల సాగు
- ఇంటిపై సుమారు 15 రకాల పంటలు
- తనతో పాటు స్నేహితులకూ పంచుతున్న వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న లక్ష్మణ్‌యాదవ్

మార్కెట్లో ఏది కొందామన్నా కల్తీయే. డబ్బులు పెట్టి రోగాలు కొనుక్కున్నట్లుఅవుతున్నది. ఆఖరికి కూరగాయలు, పండ్లను కూడా రసాయనాలతోనే ఉత్పత్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాను తినే పండ్లు, కూరగాయలు రసాయనాలు లేకుండా పండించుకోవాలని ఆలోచన చేశాడు మేడ్చల్‌కు చెందిన యోగా టీచర్ లక్ష్మణ్‌యాదవ్. అనుకున్నదే తడువుగా మిద్దెపై సేంద్రియ సాగు ప్రారంభించాడు. తన కుటుంబానికి సరిపడా పండించడమే కాకుండా తన మిత్రులకు కూడా పంచుతున్నాడు. - మేడ్చల్ ప్రతినిధి, ఆంధ్రజ్యోతి

- వివరాలు 7లో..

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

వికారాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచం ఉన్నంత వరకు రామాయణం, వాల్మీకి చరిత్ర ఉంటుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణాన్ని రచించిన ఒక బోయ కులానికి చెందిన చోరుడు అయిన వాల్మీకి ఇచ్చిన స్ఫూర్తితో అనేక మంది రచయితలు, కవులుగా మారారన్నారు. ఇతిహాసాలోని సారాంశాలను ఈతరం పిల్లలకు అర్థమయ్యే విధంగా పాఠశాల కరిక్యులంలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఇలాంటి గొప్పవారి చరిత్రల గురించి తెలుసుకోవడం నేటి తరానికి అవసరమన్నారు. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

సార్.. నాకు న్యాయం చేయండి

- కూతురి రెండో పెళ్లితో ఇబ్బందులొచ్చాయ్..
- పెట్రోల్ డబ్బాతో గిరిజన మహిళ ఆత్మహత్యాయత్నం
- బషీరాబాద్ ఠాణా ఎదుట ఘటన

బషీరాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సార్.. నా కూతురు రెండో పెళ్లితో తనకు ఇబ్బందులొచ్చాయి.. మీరే న్యాయం చేయాలని ఓ గిరిజన మహిళ వెంట తెచ్చుకున్న పెట్రోల్ డబ్బాతో పోలీస్‌స్టేషన్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన గురువారం వికారాబాద్ జిల్లా బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. బాధితురాలు దేవీబాయి తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్ మండలంలోని కొత్లాపూర్ గ్రామానికి చెందిన దేవీబాయికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు. ఆమె భర్త కొన్నేళ్ల కిందట చనిపోయాడు. దేవీబాయి తన పెద్ద కూతురు మధులత(19)ని అదే తండాకు చెందిన భీమ్‌జీ అనే యువకుడికిచ్చి పెళ్లిచేసింది. నాలుగు నెలలు తిరగక ముందే దేవీబాయి కూతురు తన ప్రేమికుడు (కంసాన్‌పల్లి తండా)కు చెందిన వినోద్‌చౌహాన్ అనే యువకుడితో భర్త ఇంటి నుంచి పారిపోయి తర్వాత వచ్చింది. ఈ విషయమై తండా పెద్దలు ఇరు కుటుంబాలతో పంచాయితీ పెట్టారు. దేవీబాయి అల్లుడి కుటుంబికులకు పెళ్లి ఖర్చుల కింద రూ.14 లక్షలు పరిహారంగా ఇవ్వాలని తండా పెద్దలు నిర్ణయిస్తూ అప్పట్లో రాతపూర్వకంగా పత్రం రాశారు. ఈ క్రమంలో కులపెద్దల సమక్షంలో యువతిని కంసాన్‌పల్లి తండా యువకుడు వినోద్‌తోనే రెండో పెళ్లి చేశారు. యువతి మొదటి భర్తకు ఇవ్వాల్సిన పెళ్లి ఖర్చు లు రెండో పెళ్లి చేసుకున్న వినోద్ కుటుంబికులు చెల్లించాలని పంచాయితీలో పెద్దలు నిర్ణయించినా ఇవ్వడంలేదని దేవీబాయి వాపోయింది. డబ్బుల కోసం మొదటి అల్లుడి కుటుంబికులు ఒత్తిడి చేస్తున్నారని దేవీబాయి పోలీస్‌స్టేషన్ వద్ద మొరపెట్టుకుంది. అక్కడున్న పోలీసులు పంచాయితీలో ఏం మాట్లాడుకున్నారో మాకు తెలియదని, మేం ఏం చేస్తామని ఆమెతో చెప్పారు. దాంతో దేవీబాయికి ఏం చేయాలో తోచక అప్పటికే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ డబ్బాతో పోలీస్‌స్టేషన్ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించింది. పెట్రోల్ డబ్బా మూత తీసి ఒంటిపై పోసుకునే యత్నం చేస్తుండగా.. కానిస్టేబుల్ పరుగున వచ్చి డబ్బాను లాక్కున్నాడు. అక్కడే ఎస్సై గఫార్, ఏఎస్సై నారాయణ బయటకు వచ్చి దేవీబాయి కుటుంబికులకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. సాయంత్రం కులపెద్దలు బషీరాబాద్‌కు చేరుకొని మరోసారి పంచాయితీ పెట్టి అప్పట్లో ఇస్తామన్న డబ్బులు చెల్లించాలని వినోద్ కుటుంబికులను ఒప్పించడంతో వారు అంగీకరించారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ డబ్బాతో కూర్చొని రోదిస్తున్న దేవీబాయి

డీటీసీ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ

వికారాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శిక్షణ అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు పోలీస్ అభ్యర్థులకు పరీక్షలకు సంబంధించిన విషయాలలో శిక్షణ అందించాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి అభ్యర్థులకు టర్మ్-2 వార్షిక పరీక్షల సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు.

'డిజిటల్ క్రాప్ బుకింగ్'కు వీఏఏలను నియమించాలి

స్పీకర్‌కు వ్యవసాయ విస్తరణ జేఏసీ నాయకుల వినతి



స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తున్న వ్యవసాయ విస్తరణ జేఏసీ నాయకులు

వికారాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తీసుకొస్తున్న డిజిటల్ క్రాప్ బుకింగ్ పథకంలో భాగంగా ప్రభుత్వం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను నియమించాలని, వెయ్యి ఎకరాలకు ఒకరిని నియమిస్తే ఏఈవోలు అనుకూలంగా పనిచేసుకోవడానికి ఉంటుందని వ్యవసాయ విస్తరణాధికారుల (జేఏసీ) అధ్యక్షుడు ఐసాక్ హెరాల్డ్, కో-కన్వీనర్ కావ్యలు కోరారు. ఈమేరకు శుక్రవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఏ విధంగా డిజిటల్ క్రాప్ సర్వే జరుగుతుందో.. తెలంగాణలో కూడా నిర్వహించాలని కోరారు. ఏఈవోలు దాదాపు 60 శాతం మహిళలు ఉన్నారని, వారికి అసిస్టెంట్లను నియమిస్తే కొంత ధైర్యంగా ఉంటుందని, గ్రామాలకు సాఫీగా వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కో-కన్వీనర్లు సౌమ్య, రాజ్‌కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ సందీప్ కుమార్, అన్ని మండలాల వ్యవసాయ విస్తరణాధికారులు, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రపంచం ఉన్నంత వరకు రామాయణ, వాల్మీకి చరిత్ర ఉంటుందని, ఇతిహాసాల్లో మొదటిది రామాయణమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, ఏవో సునీల్, బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డి.కేశురాం, బోయ లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

తపస్య, అభినయలకు స్వర్ణాలు

డబ్ల్యూపీసీ తెలంగాణ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్



తపస్య, అభినయ

హైదరాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): డబ్ల్యూపీసీ తెలంగాణ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో సూరినేని తపస్య రావు, ఎ.అభినయ స్వర్ణ పతకాలు కొల్లగొట్టారు. హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో బీరంగూడ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థిని తపస్యరావు 38 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణం సాధించింది. అదేవిధంగా డార్విన్ నెక్స్ జనరేషన్ స్కూల్ విద్యార్థిని అభినయ జూనియర్ కేటగిరీ 52 కిలోల విభాగంలో పసిడి పతకం కైవసం చేసుకుంది. వీరిని రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షురాలు ఇంటూరి రేఖ అభినందించారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు తనిష్క్



తనిష్క్‌ను అభినంధిస్తున్న కళాశాల సిబ్బంది

శంషాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని నారాయణ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న జజాల తనిష్క్ జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈమేరకు కళాశాల సిబ్బంది గురువారం రాత్రి తనిష్క్‌ను అభినందించారు. ప్రిన్సిపాల్ రాంబాబు మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతున్న తనిష్క్ జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికవవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాగా, అండర్-19 (70 కేజీల విభాగంలో) తెలంగాణ నుంచి 32 మంది ఎంపికయ్యారని, అందులో తనిష్క్ ఒకరని ఆయన తెలిపారు.

పాంబండకు పోటెత్తిన భక్తజనం



కులకచర్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. ప్రతీనెల పౌర్ణమి సందర్భంగా హిందువులు పాంబండ గిరి ప్రదక్షిణను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. 22 నెలలుగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. మొదట్లో వందల సంఖ్యలో ప్రారంభం కాగా.. ప్రస్తుతం వేల సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. గురువారం పౌర్ణమి సందర్భంగా పెద్ద సంఖ్యలో పాంబండకు తరలి వచ్చారు. అనంతరం రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

మిద్దే.. వ్యవసాయ క్షేత్రం

- రసాయనాలు లేకుండా కాయగూరల సాగు
- ఇంటిపై సుమారు 15 రకాల పంటలు
- తనతో పాటు స్నేహితులకూ పంచుతున్న వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న యోగా గురువు లక్ష్మణ్‌యాదవ్



కూరగాయల మొక్కలకు ఎరువు వేస్తున్న లక్ష్మణ్‌యాదవ్

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలో అయ్యప్ప ఆలయం సమీపంలో నివాసం ఉండే లక్ష్మణ్‌యాదవ్ యోగా గురువు. ప్రతీ రోజు మేడ్చల్ పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎంతో మందికి ఉచితంగా యోగా నేర్పిస్తుంటాడు. కృష్ణుడి భక్తుడైన లక్ష్మణ్‌యాదవ్ ఇంట్లో అన్నింటికీ మట్టి పాత్రలనే ఉపయోగిస్తాడు. తాగే గ్లాసు నుంచి తినే ప్లేటుతో పాటు వండే పాత్రలు కూడా మట్టివే. ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ వహించే లక్ష్మణ్‌యాదవ్ రసాయానాలు లేని కూరగాయలు పండించాలనే ఆలోచన వచ్చింది. ఆ వెంటనే తన ఇంటి మిద్దెపై చిన్న చిన్న మట్టి పాత్రలను ఏర్పాటు చేశాడు. ఒక్కో పాత్రలో ఒక్కో రకమైన కూరగాయల మొక్కలను నాటాడు. ఆవుపేడ తెప్పించి తొట్టెలను నింపేశాడు. వీటితో పాటు పలు రకాల ఆకు కూరల విత్తనాలను కూడా తొట్టెలలో చల్లాడు.

శారీరక శ్రమతో పాటు ఉల్లాసం

రసాయనాలు లేకుండా సేంద్రియ పద్ధతిలో మిద్దెపై కూరగాయలను సాగు చేసుకోవడం సంతోషంగా ఉంది. ప్రతీ రోజు గంటసేపు మిద్దెపైనే కూరగాయల మొక్కల కోసం కేటాయిస్తాను. శారీరకశ్రమతో పాటు మనస్సు కూడా ఉల్లాసంగా ఉంటుంది. ఒక్క రోజు డాబాపైకి వెళ్లకపోతే ఏదో వెలితి అనిపిస్తుంది. కాస్త మనస్సు పెడితే ప్రతీ ఒక్కరు తమ ఇళ్లపై ఇలాంటి తాజా కూరగాయలు పండించుకోవచ్చు. - లక్ష్మణ్ యాదవ్

15 రకాల కూరగాయల సాగు

వంకాయ, టమాట, కొత్తిమీర, పూదీన, పాలకూర, పుంటికూర, తోటకూర, తదితర 15 రకాల వరకు కూరగాయలను ఇంటపైనే పండిస్తున్నాడు. ఇందుకోసం ఓ ప్రత్యేక నీటి ట్యాంకును ఏర్పాటు చేసి చిన్న పైపు ఏర్పాటు చేశాడు. మొదట్లో తనకు సరిపోయే కూరగాయల సాగును ప్రారంభించినప్పటికీ క్రమేణా తన వద్దకు యోగా శిక్షణకు వచ్చే వారందరికీ కాయగూరలను పంచిపెట్టడం మొదలుపెట్టాడు. ప్రతి రోజు 5 గంటల నుంచి 7 గంటల వరకు యోగా కార్యక్రమం ముగిసిన తర్వాత ఇంటికి చేరుకుని గంటసేపు కూరగాయల మొక్కలకు నీటిని పెట్టడం, కూరగాయలు మొక్కల చుట్టూ ఏవైనా పిచ్చి మొక్కలుంటే తొలగించడం, కాసిన తాజా కూరగాయలు తెంపడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటాడు. ప్రతి రోజు తనకు శారీరకంగా పనితో పాటు తాజా కూరగాయలు కూడా లభిస్తుండటం పట్ల లక్ష్మణ్‌యాదవ్ ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన వద్దకు యోగా శిక్షణకు వచ్చే వారిని ఇంటికి తీసుకెళ్లి తాను పండిస్తున్న కూరగాయల చూపిస్తూ వివరిస్తున్నాడు.

ఎయిర్‌పోర్టులో 'అతిథి దేవోభవ' ప్రారంభం

శంషాబాద్ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక శాఖ, జీహెచ్‌ఎంసీతో కలిసి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో 'అతిథి దేవోభవ' కార్యక్రమాన్ని ఆర్జీఐఏ ప్రారంభించింది. గురువారం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిపుణుల కమిటీ, టూరిజం, హాస్పిటాలిటీ, మీడియా, ఫైన్, ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ కమిటీ ప్రభుత్వ పర్యాటక శాక, రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సహకారంతో అతిథి దేవోభవ రెండో ఎడిషన్‌ను ప్రారంభించారు. పర్యాటకులకు ఆత్మీయ స్వాగతం, సురక్షితమైన ప్రయాణాన్ని నిర్ధారించేందుకు ఆటో, క్యాబ్ డ్రైవర్‌ల నైపుణ్యాలు, పరిజ్ఞానాన్ని మెరుగుపర్చడమే ఈ కార్యక్రమ ఉద్దేశం అన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని 1000 మంది డ్రైవర్లకు మూడు రోజుల ఇంటెన్సివ్ కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. భద్రతా చర్యలను పెంచేందుకు క్యూఆర్ కోడ్ వ్యవస్థతో పాటు భద్రతా శిక్షణ కోసం పోలీసు శాఖతో భాగస్వామ్యం ఓ కీలక అంశమన్నారు. ఈ సందర్భంగా జీహెచ్ ఐఏఎల్ సీఈవో ప్రదీప్ పణికర్, ఎఫ్టీసీసీఐ అధ్యక్షుడు సురేశ్‌కుమార్ సింఘాల్ మాట్లాడుతూ నాంపల్లి, కాచిగూడ, ఎంజీబీఎస్, ఇమ్లీబన్, సికింద్రాబాద్, జూబ్లీ, ఎర్రగడ్డ బస్టాండ్‌లు, శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం తదితర ప్రాంతాల్లో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక పర్యాటకం, భద్రతా చర్యలను వివరించే క్యూఆర్ కోడ్‌లతో హాల్మార్గ్ స్టిక్కర్లను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

సెలవులకు ఇంటికొస్తే సర్పంచ్‌ను చేశారు

(5వ పేజీ తరువాయి)

గర్వంగా ఉండేది. ఆ సమయంలో క్లాస్‌లోనే కాదు.. జీవితంలోనూ లీడర్‌గా ఎదుగుతావని తన స్నేహితులు అన్న విషయాలు ఇప్పుడు గుర్తుకువస్తున్నాయి. క్లాస్ లీడర్ అయినందుకో ఏమో కానీ లీడర్‌గా ఎదిగినందుకు చాలా ఆనందంగా ఉంది. ఆధ్యాత్మిక చింతన, క్రమశిక్షణే నా విజయ రహస్యం.

ఇంటర్ వరకు కాలినడకే

మా స్వగ్రామం వీర్లపల్లిలో 5వ తరగతి వరకు చదివాను. ఆ తర్వాత ఆ గ్రామం నుంచి రోజు రానుపోనూ 10 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి నందిగామ గ్రామం(ప్రస్తుతం మండల కేంద్రం) లోని ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదివాను. అదే ఉత్సహంతో మళ్లీ 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న షాద్‌నగర్ పట్టణానికి నడుచుకుంటూ వెళ్లి ఇంటర్ పూర్తి చేశాను. ఇంటర్‌లో ఫస్ట్‌క్లాస్‌లో పాసవ్వడంతో చదువులపై ఆసక్తి పెరిగింది. ఎలాగైన మంచి ఉద్యోగం సంపాదించాలన్న తపనతో హైదరాబాద్‌లోని సిటీ కాళాశాలలో బీకాం పూర్తి చేశాను. అందులోనూ ఫస్ట్ క్లాస్‌లో పాస్ కావడంతో ఎంఏలో సీటు వచ్చింది. అదే సమయంలో బీఈడీ కోర్సులో కూడా సీటు వచ్చింది. నాకు క్రీడల పట్ల కూడా ఆసక్తి ఎక్కువ. ప్రతీ రోజు స్నేహితులతో కలిసి క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ ఇలా రోజు ఏదో ఒక ఆట ఆడేవాళ్లం. ఇందులోనూ కూడా నాదే లీడర్‌షిప్.

పూర్తి శాఖాహారిగా..

నాకు రాగి సంకటి.. అంబలి చాలా ఇష్టం. మేము మొదట మాంసాహారులమైనప్పటికీ 1986 నుంచి పూర్తి శాఖాహారిగా మారాను. ప్రతీ రోజు ఇంట్లో రాగి సంకటి తిని, అంబలి సేవించిన తర్వాతనే ఇంటి నుంచి కాలు బయట పెడుతాను. మధ్యాహ్నం భోజనంలో ఏదైనా కూర, పప్పు, పెరుగు మాత్రమే తీసుకుంటాను. రాత్రి వేళలో కూడా జొన్న రొట్టె, లేదా చపాతి ఇతర వెజిటేరియన్ కర్రీస్‌తో తింటాను.



కుటుంబ సభ్యులతో వీర్లపల్లి శంకర్

గ్రామ పెద్దల ప్రోత్సాహంతోనే..

నా డిగ్రీ 1995లో పూర్తయింది. అనంతరం వేసవి సెలవులని ఇంటికి వచ్చాను. అదే సమయంలో సర్పంచ్ ఎన్నికలు వచ్చాయి. సర్పంచ్ పదవిని బీసీలకు కేటాయించారు. దీంతో మాజీ ఎమ్మెల్యే రాందేవ్‌రెడ్డి తనను ఎన్నికల బరిలో నిలబడమని సూచించాడు. వెంటనే నాకు ఇష్టం లేదని చెప్పాను. ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సంపాదించాలన్నదే నా లక్ష్యమని చెప్పాను. ఆ సమయంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో నీవు ఒక్కడివే డిగ్రీ పూర్తి చేసిన యువకుడవు.. చదువుల్లో మాదిరిగానే రాజకీయాల్లోనూ రానిస్తావంటూ గ్రామ పెద్దలు పాలకొంల్లు నారాయణరెడ్డి, శేఖర్‌రెడ్డి నవాజ్‌రెడ్డి ఎన్నికల బరిలోకి దిగేలా ప్రోత్సహించారు. ఆ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసిన నేను అందరి సహకారంతో సర్పంచ్‌గా గెలిచాను. అక్కడి నుంచే నా రాజకీయ ప్రస్థానానికి పునాది పడింది. అప్పటి నుంచి చదువులు స్వస్తి పలికి రాజకీయాలకు అంకితమయ్యాను.

సరదాగా స్నేహితులతో..

వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు నా ప్రాణ మిత్రులు. చిన్నతనంలో సెలవులు వచ్చాయంటే వారతో కలిసి షాద్‌నగర్ పట్టణానికి నడుచుకుంటూ వెళ్లి సినిమాలు చూసేవాళ్లం. కానీ ఎప్పుడూ కూడా క్లాసులు ఎగ్గొట్టి సినిమాలు, శికారులకు వెళ్లలేదు. అందుకే తమకు క్రమశిక్షణ గల విద్యార్థులుగా ఉపాధ్యాయులు గుర్తించారు. నా స్నేహితులు సైతం ఇప్పటికీ నాతోనే రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. మాజీ మంత్రి శంకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, సీనియర్ నేత ఎల్లారెడ్డి నాకు రాజకీయ గురువులు. నన్ను మండల పార్టీ అధ్యక్షుడిగా, జిల్లాలో కమిటీ సభ్యులుగా ఇలా ఎన్నో పదవులు ఇప్పించారు. రాజకీయాల్లో తనకు ప్రత్యేక గుర్తింపు వచ్చేలా చేసింది కూడా వారే. వారివల్లనే నేను ఈ స్థాయికి ఎదిగాను.



స్నేహితులతో కలిసి వీర్లపల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వీర్లపల్లి శంకర్ (ఫైల్)

ఉపాధ్యాయులను కేటాయిస్తేనే స్కూల్‌కు విద్యార్థులు

పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపిన విద్యార్థులు, తల్లిదండ్రులు



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బషీరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్త ఉపాధ్యాయులను నియమించకుండా ఇక్కడి ఉపాధ్యాయుడిని ఎలా రిలీవ్ చేశారంటూ బషీరాబాద్ మండలం పర్వత్‌పల్లి ఎంపీపీఎస్ విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఆందోళనకు దిగారు. అంతటితో ఆగకుండా విద్యార్థులను బయటకు తీసుకొచ్చి పాఠశాలకు తాళం వేసి, ఉపాధ్యాయులను నియమించాలంటూ ఆందోళన చేశారు. పర్వత్‌పల్లి ఎంపీపీఎస్‌లో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు 103మంది విద్యార్థులున్నారు. ప్రైమరీ పాఠశాలలో 66 మంది విద్యార్థులకు గాను ముగ్గురు టీచర్లున్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ఒక ఉపాధ్యాయుడు బదిలీ కాగా.. ఇంతకాలం రిలీవ్ చేయకుండా ఇక్కడే ఉంచారు. డీఎస్సీలో భాగంగా ఇక్కడ కేటాయించకపోగా బదిలీ అయినా ఉపాధ్యాయుడిని రిలీవ్ చేశారు. దాంతో తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని హెచ్‌ఎం రాఘవరెడ్డిని ప్రశ్నించగా.. తన పరిధిలో ఆ విషయం లేదని, ఉన్నతాధికారులతో మాట్లాడి చెబుతానన్నారు. కాగా, ఇద్దరు టీచర్లతో ఐదు తరగతులు ఎలా బోధిస్తారని, ఉపాధ్యాయులను నియమించే వరకు మా పిల్లలను పాఠశాలకు పంపించేదిలేదంటూ తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లిపోయారు. చేసేదేమీ లేక టీచర్లు పాఠశాల సమయం వరకు అక్కడే ఉండి వెళ్లిపోయారు. హెచ్‌ఎంను ఆరా తీయగా ఉపాధ్యాయుల కోసం ఆందోళన దిగినట్లు తెలిపారు. ఎంఈవోకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

ల్యాబ్ టెస్ట్‌కు నారపల్లి పెద్దచెరువు నీరు

- సేకరించిన పీసీబీ అధికారులు
- కలుషిత వ్యర్థ రసాయన జలాలు కలుస్తున్నాయనే విజ్ఞప్తి మేరకు పరీక్షలకు..



నీటిని సేకరిస్తున్న అధికారి, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఘట్‌కేసర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధి నారపల్లి పెద్ద చెరువు నీటిని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరీక్షించేందుకు గాను సేకరించారు. గురువారం అధికారి మహేష్ సిబ్బందితో వచ్చి చెరువు నుంచి నీటిని సేకరించి రెండు గాజు సీసాలు, ఒక ప్లాస్టిక్ డబ్బాలో పట్టి భద్రపరిచారు. పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపుతామని, రిపోర్టు ఆధారంగా చెరువు నీటిలో ఎలాంటి రసాయనాలు కలుస్తున్నాయో తెలుస్తుందని ఆయన తెలిపారు. కాగా, చెంగిచెర్ల కబేళా నుంచి కలుషిత వ్యర్థ రసాయన జలాలు దిగువకు వదిలిపెడుతుండటంతో నారపల్లిలోని చెరువులు పూర్తిగా కలుషితం అవుతున్నాయని ఇటీవల పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి అధికారులకు విన్నవించారు. నారపల్లి చెరువులోకి కబేళా నీరు చేరడంతో పరిసరాలు కలుషితం అవుతున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులకు, మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. దాంతో అధికార సిబ్బంది నీటి శాంపిళ్లను సేకరించారు. మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రెడ్డియానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్ రవీందర్, నాయకులు శ్రీనివాస్, నర్సింహ, అక్రంఅలీ, బాల్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.204 కోట్లు మంజూరు

- సీఎం రేవంత్ సహకారంతో కల్వకుర్తికి మహర్దశ
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో బీటీరోడ్ల నిర్మాణానికి రూ.204 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు. నియోజకవర్గ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా రోడ్ల అభివృద్ధి, ఆధునీకరణకు నిధులు మంజూరు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యనాయక్, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి డి.మోహన్‌రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటు, రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి మహర్దశ ఏర్పడిందని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలో ఆరు రోడ్ల విస్తరణకు రూ.189 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు కసిరెడ్డి వెల్లడించారు. వెల్దండ మండలం కొట్రగేటు నుంచి కల్వకుర్తి వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణకు రూ.30 కోట్లు, వెల్దండ నుంచి సిరసనగండ్లకు డబుల్ రోడ్డుకు రూ.40కోట్లు, జూపల్లి నుంచి వంగూరు గేటు వరకు రూ.9కోట్లు, ఆమనగల్లు మండలం కోనాపూర్ గేటు మాడ్గుల వరకు 21 కిలోమీటర్ల డబుల్ రోడ్డు విస్తరణకు రూ.45కోట్లు, ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లి నుంచి చంద్రాయన్‌పల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.30కోట్లు, తలకొండపల్లి చౌరస్తా నుంచి కొట్రగేటు వరకు రోడ్డు విస్తరణకు రూ.35కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే వివరించారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ ద్వారా నాలుగు పనులకు రూ.15కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మాడ్గుల మండల కేంద్రంలో అంతర్గత సీసీ, డ్రైనేజీల నిర్మాణానికి రూ.7.75కోట్లు, వెల్దండ మండలం రాచూరు తండా నుంచి తిమ్మినోనిపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్లు, కల్వకుర్తి రోడ్డు నుంచి ఎంగంపల్లి మీదుగా మార్చాల వరకు బీటీరోడ్డుకు రూ.5కోట్లు నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని జీపీలు, గిరిజన తండాల నుంచి మండల కేంద్రాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.100 కోట్ల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, వారం రోజుల్లో విడుదలవుతాయని తెలిపారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సభలో కేసీఆర్ అనేక హామీలు ఇచ్చినా కాగితాలకే పరిమితమయ్యాయని, వాటిని సాధించడంలో అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విఫలమయ్యారని ఆరోపించారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశానని జైపాల్ యాదవ్ గొప్పగా చెప్పుకోవడమే తప్ప నియోజకవర్గానికి సాధించిందేమీ లేదన్నారు. కాగా, సీఎం రేవంత్, మంత్రులు సీతక్క, వెంకట్‌రెడ్డిలకు కసిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు హన్మనాయక్, కాసు శ్రీనివాస్‌రెడ్డి, మండ్లీ రాములు, గూడూరు భాస్కర్‌రెడ్డి, చందోజీ, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, బీచ్యనాయక్, జగన్, మానయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కసిరెడ్డి కృషి అభినందనీయం

కల్వకుర్తి నియోజకవర్గ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రహదారు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయించడం అభినందనీయమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈమేరకు శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో సత్కరించారు.



బషీరాబాద్‌లో ఎమ్మెల్యే సోదరుడి కాన్వాయ్‌ని ముందుకు పంపి వెనక వెళ్తున్న ఎస్కార్ట్ వాహనం

ఎమ్మెల్యే సోదరుడికి ఎస్కార్ట్!

బషీరాబాద్‌లో చర్చనీయాంశమైన పోలీసుల తీరు

బషీరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే సోదరుడు, కాంగ్రెస్ నాయకుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డికి బషీరాబాద్ పోలీసులు ఎస్కార్ట్ పెట్టడం స్థానికంగా చర్చనీయాంశమైంది. గురువారం బషీరాబాద్‌లో దుకాణాల ప్రారంభోత్సవానికి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి కాన్వాయ్‌తో వచ్చారు. ఇదిచూసిన పలువురు స్థానికులు ఎమ్మెల్యే తమ్ముడికి ఏ హోదాలో పోలీసులు ఎస్కార్ట్ ఇచ్చారనే దానిపై చర్చించుకున్నారు. ఎస్సై విలేకరులను గమనించి ఏఎస్సై ఆధ్వర్యంలోని కాన్వాయ్‌ని వెనక్కు వెళ్లాలని సూచించారు. అనంతరం ఈ విషయమై బషీరాబాద్ ఎస్సైని వివరణ కోరగా.. ఎమ్మెల్యే వస్తున్నారనే సమాచారంతో సిబ్బంది.. ఎస్కార్ట్ ఇచ్చేందుకు వెళ్లారని, కాని కార్యక్రమానికి ఎమ్మెల్యే సోదరుడు రావడంతో వెనక్కు వచ్చారని చెప్పారు.

కోనాపూర్ రోడ్డుకు మహర్దశ

- డబుల్ రహదారి నిర్మాణానికి రూ.45కోట్ల నిధులు మంజూరు
- తీరనున్న వాహనదారుల ఇక్కట్లు
- ఆమనగల్లు, మాడ్గుల మండలాల ప్రజల హర్షాతిరేకాలు


ప్రస్తుతం ఉన్న కోనాపూర్ సింగిల్ రోడ్డు

ఆమనగల్లు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపూర్ రోడ్డుకు మహర్దశ పట్టింది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి కోనాపూర్ గేటు నుంచి ఆకుతోటపల్లి, దొడ్లపహాడ్, అప్పారెడ్డిపల్లిల మీదుగా మాడ్గుల వరకు 21కిలోమీటర్ల బీటీ రోడ్డు విస్తరణకు ప్రభుత్వం నిధులు విదిల్చింది. రోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ రూ.45కోట్లు కేటాయించింది. రోడ్డు వెడల్పు పనులను త్వరగా ప్రారంభించేందుకు అధికారులు చర్యలుచేపడుతున్నారు. ఈ రోడ్డును 20ఏళ్ల క్రితమే ఆర్‌అండ్‌బీకి మార్చారు. సింగిల్ రోడ్డుగా ఉన్న కోనాపూర్-మాడ్గుల రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించాలని ఆమనగల్లు, మాడ్గుల మండలాల ప్రజలు ఏళ్లుగా కోరుతున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. డబుల్ రోడ్డుకు నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నిధులు సాధించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డిలకు ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మైసమ్మ, పోచమ్మ బోనాలు


నందిగామలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

నందిగామ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నందిగామలో నిర్మించిన గ్రామదేవతల ఆలయాల్లో మైసమ్మ, పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠలు చేశారు. గురువారం మైసమ్మ, పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు వంకాయల నారయణరెడ్డి, ఈట గణేష్, రామన్న, క్రిష్ణ, వెంకట్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, చంద్రపాల్‌రెడ్డి, కుందారపు వెంకట్‌రెడ్డి, దార లింగం, కొమ్ము వెంకటయ్య, వెంకటయ్య, అంజూయాదవ్, కె.రాంరెడ్డి, సుమన్, ప్రభయ్య పాల్గొన్నారు.

దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన

షాద్‌నగర్:షాద్‌నగర్‌లోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో శ్రీదక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పూర్ణాహుతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం జయజయ ధ్వానాలతో మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వామి గిరీష్‌నాయర్, అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి నందీశ్వర్, కృష్ణయ్య పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు

అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

యాచారం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని గ్రీన్‌ఫార్మాసిటీ పీఎస్ సీఐ లిక్కి కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డి అన్నారు. తాటిపర్తిలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మహిళ వద్ద సీఐ, ఎస్సైలు కూరగాయలు కొని తాము సామాన్య పౌరులమే అని చెప్పారు. ఎవరిని ఎవరైనా ఇబ్బందిపెడితే 100కు డయల్ చేయాలన్నారు. బాలికలను, మహిళలను ఎవరైనా ఈవ్‌టీజింగ్ చేస్తే చెప్పాలన్నారు. వాహనాల అన్ని పత్రాలను డ్రైవర్లు దగ్గర ఉంచుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.


తాటిపర్తిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మినీ అంగన్వాడీ టీచర్లకు సమాన వేతనమివ్వాలి


సీపీడీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

చేవెళ్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : మినీ అంగన్వాడీ టీచర్లకు కూడా మెయిన్ అంగన్వాడీలతో సమానంగా వేతనాలివ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ అన్నారు. గురువారం చేవెళ్లలో సీపీడీవో కార్యాలయంలో మినీ అంగన్వాడీలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 4వేల మంది మినీ అంగన్వాడీ టీచర్లను మెయిన్ అంగన్వాడీ టీచర్లుగా గుర్తిస్తూ జీవో 4ను విడుదల చేశారని తెలిపారు. ప్రధాన అంగన్‌వాడీ టీచర్ల వలెనే మినీలు సైతం అన్ని విధులూ నిర్వర్తిస్తున్నారని, వేతనం మాత్రం సగమే ఇస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం మినీ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలన్నారు. పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల మినీ అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అతివేగం తెచ్చిన అనర్థం

- స్పీడ్‌గా వెళ్తున్న ఆటోలోంచి ఎగిరిపడి యువకుడి మృతి


శంకర్ మృతదేహం

చేవెళ్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అతివేగం, అజాగ్రత్తగా ఆటో నడపడంతో వెనుక కూర్చున్న యువకుడు ఎగిరిపడి తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందిన హృదయ విదారక సంఘటన గురువారం చేవెళ్ల మండల పరిధి కేసారం గేటు సమీపంలో జరిగింది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం, మర్కల్‌కు దున్నపోతుల శంకర్(19) హైదరాబాద్‌లో ఓ చేపల వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. మీప అంగళ్లలో చేపలు అమ్మేందుకు నిత్యం ఆటోలో వెళ్తుంటారు. గురువారం చేవెళ్ల మార్కెట్‌లో చేపలు అమ్మేందుకు ఆటోలో బయల్దేరారు. హైద్రాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై డ్రైవర్ ఆటోను వేగంగా నడపడంతో కేసారం గేటు సమీపంలో అదుపుతప్పింది. ఆటో వెనుక కూర్చున్న శంకర్, రాములు ఎగిరి రోడ్డుపై పడిపోయారు. శంకర్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రాములు గాయాలతో బయటపడ్డాడు. శంకర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహానికి చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ

శంకర్‌పల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లిలోని చెవెళ్ల రోడ్డులో గల రెండు దుకాణాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. షటర్లు లేపి నగదు ఎత్తుకపోయారు. వైష్ణవి హార్డ్‌వేర్ అండ్ ఎలక్ట్రికల్ దుకాణ యజమాని మల్లారెడ్డి, సంగమేశ్వర ఎంటర్‌ప్రైజెస్ షాపు ఓనర్ రమేష్ బుధవారం రాత్రి దుకాణాలు బంద్‌చేసి వెళ్లారు. గురువారం వచ్చే సరికి చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. హార్డ్‌వేర్ షాపులో రూ.25వేలు, ఎంటర్‌ప్రైజెస్‌లో రూ.17వేలు పోయినట్లు గుర్తించారు. పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

పంట ధ్వంసం చేసిన వారికి జరిమానా

యాచారం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైతు పొలంలోకి ప్రవేశించి పంటను ధ్వంసం చేసిన ఒకొక్కక్కరికి రూ.2,500 జరిమానా లేదా 2నెలల జైలుశిక్ష విధిస్తూ ఇబ్రహీంపట్నం ఆరో అదనపు న్యాయాధికారి హిమబిందు గురువారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటకు చెందిన బండె ప్రతాప్‌రెడ్డి పొలంలోకి 2020లో గ్రామానికి చెందిన ఇరుగదిండ్ల పెద్ద ఈదయ్య, ఇరుగదిండ్ల సత్తయ్య వెళ్లి పంటను ధ్వంసం చేశారు. దీంతో ప్రతాప్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై ప్రభాకర్ కేసు నమోదు చేసి కోర్టుకు ఆధారాలు సమర్పించారు. కేసు విచారించిన న్యాయాధికారి ఈ మేరకు జరిమానా/శిక్ష విధించారని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సిఐ లిక్కి కృష్ణంరాజు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆదిభట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కుళ్లిన స్థితిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన గురువారం ఆదిభట్ల పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్సై పి.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం నాదర్‌గుల్ పరిధి పార్వతీపురం కాలనీలో దుర్గామాత ఆలయం సమీపంలో మహిళ మృతదేహం ఉందని సమాచారమొచ్చింది. పోలీసులు చేరుకొని వివరాలు పరిశీలించగా మృతురాలి వివరాలేవీ లభ్యం కాలేదు. మృతురాలి వయస్సు 55సంవత్సరాలు ఉండొచ్చని, పింక్ కలర్ చీర, పసుపు రంగు బ్లౌజ్ ధరించిందని పోలీసులు తెలిపారు. ఆమె అదే ప్రాంతంలో బిక్షాటన చేసేదని స్థానికులు తెలిపారు. అనారోగ్యంతో చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశామని, మృతురాలి వివరాలు తెలిస్తే ఆదిభట్ల పీఎస్-8712662671, సీఐ-8712662364, ఎస్సై-8712580121 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. ఐదుగురికి గాయాలు

యాచారం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అతి వేగంగా వచ్చిన కారు ముందున్న ఆటోను ఢీకొట్టడంతో ఆటోలోని ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ శంకర్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. బుధవారం అర్ధరాత్రి నల్గొండ జిల్లా చందంపేట మండలం మురుపునూతలకు చెందిన తిరుపతయ్య తన బంధువులు వెంకటమ్మ, విష్ణు, చంద్రకళ, సరితలతో కలిసి ఆటోలో హైదరాబాద్ వెళ్తున్నారు. మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రం వద్ద వెనక నుంచి కారొచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలోని వారంతా తీవ్రంగా గాయపడ్డారు. వారిని పెట్రోమొబైల్1 పోలీసులు ఇబ్రహీంపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాల్మీకి జయంతి వేడుకలు


గట్టిప్పలపల్లిలో వాల్మీకి జయంతి వేడుకల్లో గోలి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి/చౌదరిగూడ, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి ఆలయం వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పూజలు చేశారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు సీఎల్.శ్రీనివాస్ యాదవ్ కార్యక్రమానికి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం మహాకావ్యం మానవాళికి ఆదర్శమన్నారు. మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, స్వామి, సంఘం నేతలు శేఖర్, కిషన్, కొండల్, రమేశ్, శంకర్, పవన్, మల్లేశ్, రాజు, కృష్ణయ్య, రేణురెడ్డి, రాజేందర్, అశోక్, శ్రీను, మశ్చేందర్, అనంతరాములు, అంజయ్య, రమేశ్, శేఖర్ పాల్గొన్నారు. అలాగే వాల్మీకి జయంతిని కొందుర్గు బస్టాండ్ ఆవరణలో వాల్మీకి బోయ సంఘం మండలాధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీరాముడి జీవిత చరిత్రను ప్రపంచానికి అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ఆయన జయంతిని జరుపుకోవడం సంతోషకరమన్నారు. వాల్మీకి(బోయ) సోదరులు ఎస్టీ సాధన పోరాట ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బోయలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని కాంక్షించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శంకర్, కృష్ణ, అశోక్, యాదయ్య, కుర్మయ్యనర్సింలు, జంగయ్య, శ్రీను,వీరయ్య, రాంచంద్రయ్య, వెంకటయ్య, నిరంజన్ పాల్గొన్నారు.


కొందుర్గులో వాల్మీకి జయంతి వేడుకలో పాల్గొన్న స్థానికులు

25న ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు

కడ్తాల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్యవైశ్య సంఘం ఈస్ట్‌జోన్ అధ్యక్ష పదవికి ఈ నెల 25న ఎన్నికలు నిర్వహిస్తామని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఊరే లక్ష్మణ్‌గుప్తా, రాష్ట్ర నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ తెలిపారు. అధ్యక్ష పదవికి గురువారం నామినేషన్ల స్వీకరణ ప్రారంభించినట్లు చెప్పారు. వనస్థలిపురంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నామినేషన్లు స్వీకరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆగిరి రమేశ్‌గుప్తా, సురేశ్, జగన్, రమేశ్, శ్రీనివాస్, రమేశ్ నామినేషన్ వేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్, రవి, లక్ష్మయ్య ఉన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు ట్రోఫీ అందజేత

చౌదరిగూడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):యువకుల్లో క్రీడ నైపుణ్యం ఉందని కొందుర్గు మాజీ వైస్‌ఎంపీపీ రాజేష్ పటేల్ అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని కొందుర్గులో ఈ నెల 13న వీపీఎల్ ప్రీమియర్‌లీగ్ సీజన్-4 క్రికెట్ పోటీలు నిర్వహించారు. గురువారం ఫైనల్ మ్యాచ్‌లో ఢిల్లీ టీం ముంబయ్‌పై గెలిచింది. ఆయన విజేతకు నగదు, ట్రోఫీలను అందజేశారు.

విజేతలు వీరే: ముఖ్య అతిథులు విజేతలకు ట్రోఫీ, మెమొంటోలు అందజేశారు. ఢిల్లీ టీంకు రూ.20వేలు, ట్రోఫీ రాజేష్ పటేల్, రన్నర్ ముంబాయికి టీంకు 10వేలు కృష్ణ అందించారు.బోయశంకర్, సత్యనారాయణ, హరి, శంకర్, నర్సింలు, అర్జున్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి కల్పన

కడ్తాల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కార్మికులకు, నిరుద్యోగ యువతకు ప్రభుత్వం వృత్తినైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి, ఉద్యోగాలు కల్పించేలా కృషిచేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. వంపుగూడలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్), తెలంగాణ భవన నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణరంగ కార్మికులకు ఇచ్చిన 15రోజుల శిక్షణ గురువారం ముగిసింది. నిర్వాహకుడు, మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. నైపుణ్యం పెంపొందించుకుంటేనే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య మాట్లాడుతూ తాపీ మేస్త్రీలకు, యువతకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్, వెల్డర్, పెయింటింట్, స్టోర్ కీపర్ వృత్తుల్లో 15రోజుల శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణలో రోజుకు రూ.300 చొప్పున స్టైఫండ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బిక్య, బిచ్య, భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, లక్‌పతినాయక్, చందోజీ, సురేందర్‌రెడ్డి, నరేందర్, పర్వతాలు, నరేశ్, కృష్ణ, రాజేందర్, శిక్షకులు పుష్పాంజలి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి


బీమా చేయిస్తున్న స్వచ్ఛభారత్ రాష్ట్ర కన్వీనర్ రాము

షాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జీవిత బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము అన్నారు. గురువారం షాబాద్‌లో బీమా స్కీమ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించి, వారితో బీమాచేయించారు. ఆయన మాట్లాడుతూ.. పీఎం జీవనజ్యోతి యోజన, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాలను చేయించుకుంటే రూ.2లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నరేష్, సాయి, ఎస్‌బీఐ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉద్యమాల పార్టీ బీఎస్పీ


దొడ్డి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీఎస్పీ నాయకులు

షాద్‌నగర్, అక్టోబరు 17(ఆంధజ్యోతి): బీఎస్పీ మహా ఉద్యమాల పార్టీ అని రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం షాద్‌నగర్‌లో ఆయనను బీఎస్పీ నాయకులు సన్మానించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ బీఎస్పీ అంటేనే ఉద్యమాల పార్టీ అన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీఎస్పీ ఎల్లప్పుడూ బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నర్సింహులు, నియోజకవర్గ బీవీఎఫ్ కో-కన్వీనర్ శ్యామ్, సొంటి శ్రీనివాస్, జగన్, కృష్ణ, పలువురు యువకులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులపై విచారణ చేస్తున్నాం


సాధన, డీఎల్పీవో

యాచారం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్ఎస్ కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులపై విచారణ చేస్తున్నామని డీఎల్‌పీవో సాధన తెలిపారు. గురువారం యాచారంలో ఆమె మాట్లాడుతూ.. మంచాలలో 58, మాడ్గులలో 683, యాచారంలో 2159 దరఖాస్తులొచ్చాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తారని చెప్పారు. నిబంధనల మేరకు ఫీజు చెల్లించాలని ఆమె తెలిపారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

షాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతొక్కరూ కృషిచేయాలని పూర్వ విద్యార్థి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తాళ్లపల్లి హై స్కూల్ 1984-85 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు పాఠశాలకు గురువారం ఆటవస్తులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ... ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని, విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు టీచర్లు కృషిచేయాలన్నారు. ప్రభుత్వ ట్రైయిన్డ్ టీచేర్ల బోధిస్తారని చెప్పారు.

ఆమనగల్లుకు సాగునీరు.. కాంగ్రెస్ నేతల సంబరాలు



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డి-82 కాల్వ పనులు పూర్తిచేయించి వెల్దండ, ఆమనగల్లు మండలాలకు సాగునీటి విడుదలతో ఆమనగల్లులో గురువారం కాంగ్రెస్ నేతలు సంబరాలు జరుపుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల, పట్టణ అధ్యక్షులు జగన్, వస్పుల మానయ్యల ఆధ్వర్యంలో నాయకులు,కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేఎల్ఐ డి-82 కాల్వ పూర్తిచేయించి రైతుల దశాబ్దాల కల నిజం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. వారంరోజుల్లో నాగిళ్ల వరకు కృష్ణా నీటిని పారిస్తామన్నారు. డి-82 కింద 35వేల ఎకరాలకు సాగునీరందిస్తామనిచెప్పారు. కుర్చీ వేసుకు కూర్చొని పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ పూర్తిచేస్తామన్న అప్పటి సీఎం కేసీఆర్ మాట తప్పడంతో ఆయనకు కుర్చీ లేకుండాపోయిందని నారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, బిచ్యా, పార్టీ జిల్లా/మండలాల నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బిక్య, హన్మ, కె.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.రాములు, జి.భాస్కర్‌రెడ్డి, చందోజీ, కేశవరెడ్డి, జగన్, కృష్ణనాయక్, కృష్ణ, మల్లయ్య, రాజశేఖర్,హీరాసింగ్, తులసీరామ్, బాబ,ఫరీద్, అజీం, శ్రీకాంత్, శ్రీశైలం, రహీమ్, జగన్, పాండురంగయ్య, ప్రసాద్, మహేశ్, లక్ష్మయ్య, సురేశ్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

శంకర్‌పల్లి/ఆమనగల్లు, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని శంకర్‌పల్లి, మహ రాజ్‌పేట్ పశువైద్యాధికారులు మానసరెడ్డి, శ్రావణిగౌడ్ తెలిపారు. మహాలింగపురం, కొత్తగూడ, చిన్నశంకర్‌పల్లి, కొండాకల్, జన్వాడ గ్రామాల్లో గురువారం గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. వారు మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల పెంపకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఆమనగల్లు పశువైద్యాధికారి అగ్నివేశ్ కోరారు. పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శెట్టిపల్లిలో పశువుకు టీకాలు వేశారు. అన్ని గ్రామాల్లో టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సులేమాన్, యాదయ్య, బుర్హానుద్దీన్, పాలాక్ష, గోపాలమిత్రలు హరీశ్, రమేశ్, ప్రకాశ్, రైతులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం

రెండు డిగ్రీ కళాశాలల బంద్

షాద్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల యాజమాన్యాల పిలుపు మేరకు షాద్‌నగర్‌లోని విజ్ఞాన్, బీపీఎమ్ డిగ్రీ కళాశాలలు బుధ, గురువారాలు బంద్ నిర్వహించాయి. కాలేజీలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.600కోట్లు విడుదల చేయాలని యాజమాన్యాలు డిమాండ్ చేశాయి. ఈ విషయమై గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు సమావేశమై చర్చించారు. మూడు, నాలుగు రోజుల అనంతరం రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో శుక్రవారం నుంచి కళాశాలను కొనసాగిస్తామని యాజమాన్యాలు తెలిపాయి.

'ఆలయాలను టార్గెట్ చేసిన వారిని శిక్షించాలి'

చేవెళ్ల, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి):హిందూ ఆలయాలపై దాడులకు పాల్పడిన వారిని ప్రభుత్వాలు శిక్షించాలని బీజేపీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంతరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్రనాయకుడు అంజనేయులుగౌడ్, బీజేపీ మండల వైస్‌ప్రెసిడెంట్ డి.చెర్వలింగం, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఇంద్రసేనారెడ్డిలు డిమాండ్ చేశారు. గురువారం చేవెళ్లలో మాట్లాడారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మగుడిలో విగ్రహాన్ని ధ్వంసం చేయడం హిందువుల మనోభావాలను కించపర్చడే అని, దీన్ని ప్రతీ ఒక్కరు ఖండించాలన్నారు. నిందితులను శిక్షించాలన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలపై దాడిచేసే హక్కు ఎవరికీ లేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో అసాంఘిక శక్తులు మత ఘర్షణలు రేకెత్తించే పన్నాగం పన్నుతున్నాయన్నారు. కాగా ముత్యాలమ్మ గుడి ఘటనపై రాష్ట్ర మంత్రులెవరు స్పందించకపోవడం సరికాదన్నారు. హింసను ప్రేరేపించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

సంక్షిప్తంగా

- **ఆమనగల్లు:** ఆమనగల్లు మండల ట్రాన్స్‌కో ఏఈగా శంకర్‌నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ నుంచి ఆయన బదిలీపై ఆమనగల్లుకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీతారాములు ఏడీఈగా ఇబ్రహీంపట్నానికి బదిలీ అయ్యారు. నూతన ఏడీఈ బాలకృష్ణ, ఏఈ శంకర్‌లను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సత్కరించారు.
- **తలకొండపల్లి:** మాదాయిపల్లికి చెందిన శాంతమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. గురువారం ఆమె కుటుంబాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. రూ.3వేల సాయం అందించారు. పరామర్శించిన వారిలో శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్, రవికుమార్, యాదయ్య, రవి, ఎల్లయ్య, సధాకర్, శంకర్, ఉన్నారు.
- **చేవెళ్ల:** ఈ నెల 20న జరిగే జిల్లా హమాలీ సంఘం నిర్మాణకౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణాచారి తెలిపారు. చేవెళ్ల ఏఎంసీలో హమాలీలతో సమావేశం నిర్వహించారు. 20న ఉదయం 11గంటలకు రాజేంద్రనగర్‌లోని ఏఆర్ దేవరాజ్ భవన్‌లో జిల్లా హమాలీ నిర్మాణ కౌన్సిల్ సమావేశం ఉంటుందని, హమాలీలంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

సేకరణకు 15,61,639 గన్నీ బ్యాగులు అవసరం కాగా, ప్రస్తుతం 4,38,361 బ్యాగులు అందుబాటులో ఉంచారు. సన్నవడ్ల సాగు ఎక్కువ ఉన్న మండలాల్లో మరికొన్ని సెంటర్లు పెంచే అవకాశం ఉంది. సన్నధాన్యాన్ని గుర్తించేందుకు యంత్రాలు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కలెక్టర్, అదనపు కలెక్టర్, సివిల్ సప్లయిస్ డీఎం, డీఎస్వో, డీఆర్వో, డీసీవో తదితర అధికారులతో కొనుగోళ్ల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మరిన్ని బ్యాగులు తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, ధాన్యం తూచే, తేమ శాతాన్ని కొలిచే యంత్రాలను అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. వరినాట్లు ఆలస్యంగా వేయడంతో కోతలకు మరింత సమయం పడుతుందని అధికారుల పేర్కొంటున్నారు.

మానిటరింగ్ బృందాలు

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా జిల్లాస్థాయి అధికారులతో మానిటరింగ్ బృందాలు ఏర్పాటు చేస్తారు. ఇబ్బందులున్న చోట్ల సమస్యలను పరిష్కరించేలా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయనున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ ఏఈవో, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కమిటీలు ఏర్పాటు చేయనున్నారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు



వానాకాలానికి సంబంధించి ధాన్యం సేకరణకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో 45కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. కేంద్రాలకు 80వేల టన్నుల ధాన్యం రావచ్చని అంచనా వేశాం. ఇందుకు గన్నీ బ్యాగులను సిద్ధం చేస్తాం. వడ్లు దళారులకు అమ్మి రైతులు మోసపోవద్దు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలి.


- గోపీకృష్ణ, డీఎం, జిల్లా పౌరసరఫరాల శాఖ

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):మండల పరిధి ఎలిమినేడు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు గ్రామస్తుడు మంకాల శేఖర్‌రెడ్డి, బిక్షపతి, శ్రీశైలం, టీచర్ సూదిని అరుణశ్రీ గురువారం స్టడీ మెటీరియల్, ఐడీ కార్డులు, బెల్టు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సహకారం అందించేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని బిక్షపతి అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మారోజు సుధాకర్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత జీవితం


శ్రీకాంత్‌కు చెక్కు అందజేస్తున్న మండ్లీ రాములు

ఆమనగల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):విద్యతోనే ఉన్నత జీవితం, సమాజ ప్రగతి సాధ్యమని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, అనన్య డెవలపర్స్ అధినేత మండ్లీ రాములు అన్నారు. శంకర్‌కొండ తండాకు చెందిన నేనావత్ పాండు కుమారుడు శ్రీకాంత్ కాన్పూర్‌లో ఐఐటీ చదువుతున్నాడు. కాలేజీ ఫీజుకు అతడు ఇబ్బంది పడుతున్నాడు. విద్యార్థి తండ్రి రాములును ఆర్థికం సాయం కోరాడు. స్పందించిన రాములు రెండో సెమిస్టర్ ఫీజు కోసం రూ.40వేల చెక్కును గురువారం శ్రీకాంత్‌కు అందజేశారు. పేదవిద్యార్థుల చదువుకు ప్రతొక్కరు తోచినంతలో తోడ్పాటు అందించాల న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మానయ్య, ఆంజనేయు లు, పత్య, రాజు, శేఖర్‌రెడ్డి, జగ్‌రామ్, చంద్రు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



చౌదరిగూడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడిన రైతులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో కష్టాలు తీరాయి. గురువారం కొందుర్గు మండలం పర్వతాపూర్‌లో విద్యుత్ సమస్యపై గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలపడంతో ఆయన స్పందించి సొంత డబ్బుతో 10కేవీ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలను ఏర్పాటుచేయించారు. ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంజులమల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్, రవి, గోపాల్ పాల్గొన్నారు.